సమ్మక్క-సారక్కకు వీడ్కోలు


స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో పూజలు చేస్తున్న భక్తులు


చిల్పూరు: లింగంపల్లిలో సమ్మక్క-సారలమ్మను వనానికి తీసుకెళ్తున్న కోయ పూజారులు

● జనం నుంచి వనంలోకి..

బచ్చన్నపేట : మండలంలోని మన్‌సాన్‌పల్లి గుబ్బడి గుట్టపై నెలకొన్న సమ్మక్క, సారలమ్మ రెండ్రోజుల పాటు భక్తుల పూజలు అందుకొని శనివారం జనంలో నుంచి వనంలోకి ప్రవేశించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మళ్లీ రెండేళ్లకు వచ్చే తల్లులకు ఘనంగా వీడ్కోలు పలికారు. మాజీ సర్పంచ్ పంజాల తారశ్రీధర్ గౌడ్, నాయకులు, నిర్వాహణ కమిటీ సభ్యులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

నర్మెట : మండలంలోని అమ్మాపురంలో నాలుగు రోజులుగా పూజలందుకున్న వనదేవతలు సమ్మక్క-సారలమ్మ శనివారం వనప్రవేశం చేశారు. మొక్కులు చెల్లించిన భక్తులు సారె, ఒడిబియ్యంతో డప్పు చప్పుళ్ల నడుమ భక్తి శ్రద్ధలతో జనం నుంచి వనంలోకి సాగనంపారు. ఈసందర్భంగా జాతర హుండీ ఆదాయం రూ.1.73 లక్షలు సమకూరినట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన వనదేవతల జాతరలు

చిల్పూరు : మండలంలోని లింగంపల్లి, శ్రీపతిపల్లి-కొండాపూర్, చిల్పూరు, ఫత్తేపూర్ గ్రామాల్లో ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన సమ్మక్క-సారలమ్మ జాతరలు శనివారంతో ముగిశాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లింగంపల్లి జాతరను ఎంపీడీఓ బర్మావత్ శంకర్‌నాయక్ సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. చిల్పూరులో జాతరకు అన్ని విధాల సహకరించిన సిబ్బందిని చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్, ఎంపీపీ సరితబాలరాజు, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, గనగోని నవీన్ తదితరులు సన్మానించారు. శ్రీపతిపల్లిలో చైర్మన్ మనోజ్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాజు ఉన్నారు. కాగా శ్రీపతిపల్లి-కొండాపూర్ జాతర హుండీ ఆదాయం రూ.80 వేలు వచ్చినట్లు చైర్మన్ తెలిపారు.


స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం జాతరలో..


బచ్చన్నపేట: మన్‌సాన్‌పల్లిలో..


స్టేషన్‌ఘన్‌పూర్: హుండీ లెక్కిస్తున్న సభ్యులు


నర్మెటలో..

ఇప్పగూడెంజాతర ఆదాయం రూ.3.96లక్షలు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపెల్లిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క-సారలమ్మ జాతర ఆదాయం రూ.3,96,553 వచ్చినట్లు దేవాదాయ శాఖ ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు.

సమ్మక్క-సారలమ్మ వనప్రవేశం

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపెల్లిగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని చింతగట్టు సమ్మక్క-సారలమ్మ జాతర, తాటికొండ-జిట్టిగూడెం గ్రామాల పరిధిలోని జాతరలు శనివారం సాయంత్రం ఖాళీ అయ్యాయి. భక్తుల కొంగుబంగారమైన సమ్మక్క-సారలమ్మలు తిరిగి వనప్రవేశం చేశారు. జాతర కమిటీ చైర్మన్‌లు, ప్రత్యేక అధికారులు, ప్రత్యేక పోలీసు బందోబస్తు నడుమ వనదేవతలను కోయపూజారులతో సాంప్రదాయబద్ధంగా వనప్రవేశం చేశారు. కాగా జాతరలు ప్రశాంతంగా, ముగియడంతో కమిటీ బాధ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్



జనగామ రూరల్: కలెక్టర్‌గా రిజ్వాన్ బాషా షేక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు రోహిత్ సింగ్, పింకేష్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. శాఖలకు సంబంధించిన వివరాలు పెండింగ్ పనులు పూర్తిచేయాలని అన్నారు.

ఘనంగా స్వయం పాలన


స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

దేవరుప్పుల : స్వయం పరిపాలనతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు వస్తాయని హెచ్‌ఎం శ్రీలత అన్నారు. శనివారం మండలంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు రజనీదేవి, రమాదేవి, నిహారిక, చంద్రకళ, కృష్ణ, హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో..

లింగాలఘణపురం : మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. నిత్యం పాఠాలు నేర్పే ఉపాధ్యాయులను అనుకరిస్తూ బోధించి ప్రతిభను చూపారు.

స్వీప్‌పై విద్యార్థులకు అవగాహన


ఓటరు లిస్టును ప్రదర్శిస్తున్న తహసీల్దార్ విశాలాక్షి

స్టేషన్‌ఘన్‌పూర్ : అర్హులైన యువకులు ఓటుహక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) అనే అంశంపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ ఓటుహక్కు విలువలు, విధానంపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ రాజేష్‌నాయక్, శిక్షకులు రాజేందర్, ఆర్‌ఐ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

బచ్చన్నపేట : ఎమ్మెల్సీ ఓటరు జాబితాను సరిచూసుకోవాలని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ.. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1,886 ఓట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసిన వారిలో దాదాపు 350 వరకు స్క్రూట్నీలో పోయాయన్నారు. జాబితాను మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ప్రదర్శించామని ఓటు కోసం నమోదు చేసుకున్న వారు లిస్టును పరిశీలించుకోవాలన్నారు. ఈ జాబితాలో ఏమైనా తప్పులు దొర్లితే మార్చి 14లోపు సరి చేసుకోవాలన్నారు. సిబ్బంది సుమన్, యాకయ్య, పలువురు పాల్గొన్నారు.

'రైతులపై దాడులు సరికాదు'


సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

జనగామ రూరల్ : శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేయడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి జనార్దన్ తెలిపారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం గతంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వారిని మోసం చేశారని విమర్శించారు. తమ డిమాండ్‌లు పరిష్కరించాలని పోరాటం చేస్తున్న పంజాబ్, హర్యానా రైతులపై దాడులు చేయడం దారుణమన్నారు. దేశ సంపదను పెట్టుబడిదారులకు పంచిపెట్టి రైతులపై ఇలాంటి దాడులకు పాల్పడడం దుర్మార్గమని విచారం వ్యక్తం చేశారు. పిట్టల కుమార్, బంటు పాండు రాజు, పెద్ద మైసయ్య, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనగామ రూరల్ : జనగామ పట్టణంలోని గీతా నగర్, గిర్నిగడ్డ, వీవర్స్ కాలనీ, వడ్లకొండ ప్రాంతాల్లో నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎన్పీడీసీఎల్ ఏఈ శంకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందితో సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి



జనగామ రూరల్ : పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో నిత్యం పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో పనిచేస్తున్న కార్మికులను పట్టించుకోవాలని వారికి అన్ని రకాల వసతులు, ప్రభుత్వ పథకాలు అందించి తక్షణం వారిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

సమ్మయ్యకు సన్మానం



దేవరుప్పుల : వేద సంస్కృతి పరిషత్ ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్యకు గౌరవప్రదంగా శేషవస్త్ర సత్కారం లభించింది. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం విద్యాపురంలోని హరిహర త్రిశక్తి క్షేత్రంలో డాక్టర్ కేవీ రమణాచార్యులు, రంగాచార్య, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్.పెండెం కృష్ణకుమార్ సమ్మయ్యను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

టిప్పర్ల పట్టివేత



స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లను గురువారం రాత్రి పట్టుకోగా శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్కు రాజు తెలిపారు. ఎలాంటి వేబిల్లులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో పట్టుకున్నారు. ఆర్‌ఐ అర్జున్ అందించిన ఫిర్యాదు మేరకు టిప్పర్ల డ్రైవర్లు బైరగోని సతీష్, మోడెం శ్రీనివాస్, మోడెం రాజశేఖర్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జనగామ రూరల్: సమాజంలో ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప అన్నారు. పేదరిక నిర్మూలనపై శనివారం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో లీగల్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. సర్కస్ చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం సబ్‌జైలును సందర్శించి ఖైదీలతో మాట్లాడి ఆహారం పరిశీలించారు. చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.రవీంద్ర, ఇట్టబోయిన జ్యోష్న, ఆర్.శ్రీహరి, ఎం.బాలరాజు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ జట్టు ఎంపిక

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరిలో ఆదివారం జిల్లాస్థాయి సీనియర్ కబడ్డీ క్రీడా జట్టు ఎంపిక చేపట్టనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వై.కుమార్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలకేంద్రంలో రాష్ట్ర కబడ్డీ అసోయేషన్ సంయుక్త కార్యదర్శి తోటకూరి గట్టయ్యయాదవ్, జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, కోశాధికారి ఎదునూరి సారంగపాణి, సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. మార్చి 2నుంచి 4వరకు నల్లగొండలో జరిగే 70వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాల కోసం 94416 46095, 89190 73358, 90102 55898 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి 'అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ' పరీక్షలు

జనగామ రూరల్: ఈనెల 26 నుంచి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఓపెన్ డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య, సమన్వయకర్త అనగాని శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 5 నుంచి 12వ తేదీ వరకు జరుగుతామని చెప్పారు. విద్యార్థులు వాట్సాప్‌లోని లింక్‌ద్వారా హాల్‌టికెట్లు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

కమిటీ ఎన్నిక

కొడకండ్ల : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల కమిటీని శనివారం మండలకేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడ స్వామి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎడెల్లి శ్రీను, అధికార ప్రతినిధిగా అందె మధు, ప్రధాన కార్యదర్శిగా నామాల ఈదన్న, ఉపాధ్యక్షులుగా అందె హరీష్, మచ్చ సురేష్, మల్లేష్, సహాయ కార్యదర్శిగా తీగల మల్లేష్, కార్యదర్శులుగా శోభన్ బాబు, దయాకర్, మురళి, సతీష్, యాదగిరి, ప్రచార కార్యదర్శిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

వాసవీ క్లబ్ సభ్యుల ప్రమాణస్వీకారం


లింగాలఘణపురం : మండలంలోని వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం శనివారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడిగా దారం అశోక్, కార్యదర్శిగా మెతుకు అనంతరాములు, కోశాధికారిగా బెల్ల శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా గుడిసెల శివరామకృష్ణ, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు



స్టేషన్‌ఘన్‌పూర్ : ఆర్టీసీ బస్సులు మేడారం జాతరకు వెళ్లడం, జాతర నుంచి తిరిగి వస్తున్న బస్సులతో ట్రాఫిక్ కారణంగా ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. హనుమకొండ, జనగామ, హైదరాబాద్, పాలకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు శనివారం బస్టాండ్‌లో గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది.

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య



జనగామ రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే నాణ్యమైన విద్య అందుతోందని అన్ని రకాల వసతులు ఉన్న జనగామ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులు చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య విద్యార్థులను కోరారు. శనివారం కళాశాల అడ్మిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయని లైబ్రరీ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సూలేమాన్, శ్రీనివాస్, రవిప్రసాద్, శైలజ, రాజేశ్ కుమార్, డిపార్ట్‌మెంటల్ అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్ : కవులు, కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేడు(ఆదివారం) 'కవన తీగ' పుస్తక ఆవిష్కరణ ఉంటుందని రచయిత చిలుమోజు సాయికిరణ్ అన్నారు. ఈమేరకు శనివారం పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



బచ్చన్నపేట/ రఘునాథపల్లి : బచ్చన్నపేట బండనాగారం రామలింగేశ్వరాలయం, రఘునాథపల్లి మండలంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని అర్చకులు, భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మాఘపౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించగా 30 జంటలు కూర్చున్నారని అన్నారు.

సాంకేతిక అధికారిగా చంద్రశేఖర్



చిల్పూరు : మండలంలోని పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వంచ చంద్రశేఖర్‌రెడ్డిని ఖేలో ఇండియా యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక అధికారిగా నియమించినట్లు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి శనివారం ప్రకటించారు.

మడేలయ్యకు బోనాలు

బచ్చన్నపేట : మండల కేంద్రంలో మడేలయ్యకు రజకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడేలయ్య స్వామి ఆలయం వద్దకు రజక కుటుంబాలు బోనాలు, డప్పు చప్పుళ్లతో శివసత్తుల పూనకాలతో బయలుదేరారు.

దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా

జనగామ రూరల్ : జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగతనాల పట్ల ప్రత్యేక నిఘా పెట్టినట్లు వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఏసీపీ దామోదర్‌రెడ్డి తెలిపారు. శనివారం విద్యుత్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దొంగతనాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్యేక పూజలు

పాలకుర్తి టౌన్/ పాలకుర్తి : మండలంలోని ఎల్లరాయని తొర్రూరు ఊర గుట్టలో వెలసిన వెంకటేశ్వరుడు, మల్లికార్జునస్వామి, ఎల్లమ్మ విగ్రహాలకు శనివారం పూజలు చేశారు. గ్రామంలోని ఒగ్గు కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. పూజారులు, ఒగ్గు కళాకారులు, శివసత్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవంలో సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి పులి గణేష్, ఆలయ చైర్మన్ గోనె మహేందర్, ఎంపీటీసీ కౌసల్య మడిపెల్లి, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

దేవరుప్పుల : మండలంలోని సీత్యాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు చేస్తుండగా టీఆర్‌ఈ సభ్యుడు శ్రీనివాస్ విద్యుత్ సరఫరా ఉన్న లైన్‌ను తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కాగా శ్రీనివాస్ ఎడమచేయితోపాటు శరీరం వెనక భాగం కాలి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు క్లస్టర్ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి వివరించారు.

నిర్మాణాలు చేయొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ శివారు సర్వేనంబర్ 979లో గల తలకాయల గుట్ట ప్రభుత్వ ఆధీనంలో ఉందని, ఈ స్థలంలో ఎవరు ఎలాంటి కట్టడాలు చేయొద్దని తహసీల్దార్ వెంకటేశ్వర్లు శనివారం ప్రకటనలో తెలిపారు. తలకాయల గుట్టపై కొంతకాలంగా హిందువులు, క్రైస్తవులకు మత సంబంధమైన వివాదం ఉన్నట్లు తమదృష్టికి వచ్చిందని, స్థలంలో ఎలాంటి కట్టడాలు గాని, మత ప్రచారాలు గాని చేపట్టవద్దని ఆయన ఆదేశించారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని వినతి

పాలకుర్తి టౌన్ : నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శనివారం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాలకుర్తి, చెన్నూరు గ్రామాల్లో రిజర్వాయర్ భూనిర్వాసిత రైతులకు వెంటనే పరిహారం అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు.

'మండల అధ్యక్షుడిని మార్చాలి'

బచ్చన్నపేట : బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిని మార్చాలని తాజా మాజీ ప్రతినిధులు పలు గ్రామాల నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా పాత కమిటీ ఇలాగే కొనసాగితే రాబోయే ఎన్నికల్లో ఇబ్బందిగా ఉంటుందని కార్యకర్తలు మార్పును కోరుకుంటున్నట్లు బహిరంగ సమాచారం.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం


జనగామ రూరల్: నియామకపత్రం అందుకుంటున్న రాజా

జనగామ రూరల్ : బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం 12 మండలాల అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి నియమించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిరికొండ విద్యాసాగర్, ముఖ్యఅతిథిగా పాల్గొని కమిటీలను ఎన్నుకున్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా జంగ రాజావెంకట నర్సింహారెడ్డిని, అలాగే చిల్పూరు మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన బాల్నె శ్రీనివాస్‌ను బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. కాగా జనగామ రూరల్ బీజేపీ మండల అధ్యక్షుడిగా లద్దునూరి మహేష్, కొడకండ్ల మండల అధ్యక్షుడిగా ఉపేందర్,రఘునాథపల్లి అధ్యక్షుడిగా వేణుకుమార్, దేవరుప్పుల అధ్యక్షుడిగా కాసాని సత్తయ్య యాదవ్, స్టేషన్‌ఘన్‌పూర్ అధ్యక్షుడిగా సట్ల వెంకటరమణగౌడ్ , చిల్పూరు అధ్యక్షుడిగా ఉపేందర్‌యాదవ్, పాలకుర్తి అధ్యక్షుడిగా దుంపలి సంపత్ , బచ్చన్నపేట అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి, జఫర్‌గఢ్ అధ్యక్షుడిగా కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, లింగాలఘణపురం అధ్యక్షుడిగా ఆంజనేయులును జిల్లా అధ్యక్షుడు నియమించారు. అనంతరం కార్యకర్తలను, నాయకులను ఉద్దేశించి దశమంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీకోసం నిరంతరం కష్టపడి పని చేసి, క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్, శివరాజ్, భువనగిరి పార్లమెంట్ కోకన్వీనర్, కొంతం శ్రీనివాస్, పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీమన్, అంజిరెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.